

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 16 అక్టోబర్ 2022 పేజీలు : 04


## డిసెంబర్ మొదటి వారంలోపు లే ఔట్లలో మౌళిక వసతుల కల్పన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

**అనంతపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త బ్యూరో**

వచ్చే డిసెంబర్ మొదటి వారంలోపు లే ఔట్లలో రోడ్డు, తాగునీటి ట్యాప్ కనెక్షన్లు, విద్యుత్ కనెక్షన్లు లాంటి అన్ని రకాల మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో హౌసింగ్, ఆర్‌డూబ్ల్యూఎస్, ఏపిఎస్పీడీసిఎల్, పబ్లిక్ హెల్త్ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో హౌసింగ్‌పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డిసెంబర్ 21వ తేదిన చేపట్టే సామూహిక గృహ ప్రవేశాలను దృష్టిలో ఉంచుకుని జగనన్న కాలనీలలో మౌలిక వసతుల కల్పన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ 21వ ప్రారంభోత్సవం చేయబోయే అన్ని నియోజకవర్గాల్లోని కాలనీలలో మౌలిక సదుపాయాలైన రోడ్లు, తాగునీటి ట్యాప్ కనెక్షన్లు, విద్యుత్ కనెక్షన్ల పనులను డిసెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 236 లే ఔట్‌లలో పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షణ చేసి పనుల పూర్తికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి కేశవనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాస్ బాషా, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సతీష్, ఏపిఎస్పీ డిసిఎల్ ఎస్ఈ నాగరాజు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వేత్త జికె కృష్ణమూర్తి పుట్టిన రోజు వేడుకలకు రాజకీయ గ్రహణం

**- రాత్రికి రాత్రే ఫ్లెక్సీల చించివేత - కేక్ కట్ చేయకుండా అడ్డుకున్న పోలీసు అధికారి - ఇది అధికార పార్టీ నేతల బెదిరింపులేనా..!**



ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దృశ్యం

**అనంతపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త బ్యూరో**

పారిశ్రామిక వేత్త బెస్తరపల్లి జికె.కృష్ణమూర్తి పుట్టిన రోజు వేడుకలకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. పుట్టిన రోజు సందర్భంగా కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కరెంటు సరఫరా నిలుపుదల చేసి రాత్రికి రాత్రే తొలగించడం, పుట్టిన రోజు సందర్భంగా టీ సర్కిల్‌లో కృష్ణమూర్తి అభిమానులు జికె యువసేన ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తుంటే అడ్డుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఓ పోలీసు అధికారి స్వయంగా జోక్యం చేసుకుని కృష్ణమూర్తి అభిమానులు కేక్ కట్ చేయకుండా హుకుం జారీ చేసినట్లు తెలియవచ్చింది. ఒక అధికార పార్టీ నేత కనుసన్నల్లోనే చర్యలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పారిశ్రామిక వేత్త బెస్తరపల్లి జికె.కృష్ణమూర్తి గత కొద్ది కాలంగా మానవ సేవే మాధవ సేవ అంటూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. దేవాలయా లకు, ప్రార్థనా మందిరాలకు విరివిగా విరాళాలు అందజేస్తూ వచ్చారు. వివిధ సేవా కార్యక్రమాలు చేస్తూ జనం మధ్యలోకి వస్తున్నారు. ఈ నేపథ్యంలో 52వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని బెస్తరపల్లి జికె. కృష్ణ మూర్తి రాజకీయ అరంగేట్రం చేయాలని ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నా యి. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గరవుతూ వస్తున్న కృష్ణమూర్తి రాజకీయాల్లోకి వచ్చి మరింత సేవ చేయాలన్న ఆలోచనతో అడుగులు వేస్తున్నట్లు తెలియవచ్చింది. అందులో భాగంగా కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసే వివిధ సేవా కార్యక్రమాలో ్ల పాల్గొని రాజకీయ అరంగేట్రం చేయాలని భావిస్తూ వచ్చినట్లు ఆయన అభిమానులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 25 లక్షల ఖర్చుతో ఆక్సిజన్ ప్లాంట్‌ను కళ్యాణదుర్గం ఆసుపత్రిలో రెండు మూడు రోజుల క్రితమే ఏర్పాటు చేశారు. ఆ ప్లాంట్‌ను పుట్టిన రోజు సందర్భంగా కృష్ణమూర్తితో ప్రారంభింపజేయాలని జికె యువసేన నాయకులు భావించారు. ఇదే సమయంలో ఆక్సిజన్‌ప్లాంట్‌లోని ఒక ముఖ్యమైన పరికరం దాదాపు 75వేలు విలువ చేసే పరికరాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలియవచ్చింది. కృష్ణమూర్తి చేతులు మీదుగా ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభం కాకముందే ప్లాంట్‌లోని ముఖ్యమైన పరికరం దొంగిలించడం చర్చనీయాంశంగా మారింది. ఇదిఎవరు చేశారో అంతుపట్టని విధంగాఉంది. ఇదే సమయంలో పారిశ్రామిక వేత్త బెస్తరపల్లి కృష్ణమూర్తి పుట్టిన రోజు పురస్కరించుకుని కళ్యాణదుర్గంలోని తహశీల్దారు ఆఫీసు, వాల్మీకి సర్కిల్, టీ సర్కిల్ తదితర ప్రాంతాల్లో దాదాపు 20కిపైగా ఫ్లెక్సీలు జికె యువసేన నాయకులు ఏర్పాటు చేశారు. కృష్ణమూర్తికి స్వాగతం చెబుతూ పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతూ ఆ ఫ్లెక్సీలు వెలిశాయి. శనివారం రోజే ఈ ఫ్లెక్సీలన్నీ వేశారు. అయితే శనివారం రాత్రి 6:30-7:00 మధ్యలోనే







జికె.కృష్ణమూర్తి (ఫైల్‌ఫోటో)

విద్యుత్ సరఫరా లేనప్పుడు ఆ ఫ్లెక్సీలన్నింటినీ కొందరు వ్యక్తులు తొలగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జన సమూహం ఎక్కువగా ఉన్న చోట రెండు ఫ్లెక్సీలు మినహా మిగతా ఫ్లెక్సీలన్నింటినీ దౌర్జన్యంగా చీకట్లో తొలగించినట్లు జికె యువసేన నాయకులు ఆరోపిస్తున్నారు. అదే పనిగా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసి ఫ్లెక్సీలు తొలగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. శనివారం రోజే టి సర్కిల్‌లో కృష్ణమూర్తి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందోత్సవాలు జరుపుకోవాలని జికె యువసేన నాయకులు భావించి ఏర్పాట్లు చేస్తుండగా ఓ పోలీసు అధికారి జోక్యం చేసుకుని అక్కడ పుట్టిన రోజు వేడుకలు జరపకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలు వస్తు న్నాయి. ఓ అధికార పార్టీనేత అండదండలతోనే కొందరు వ్యక్తులు ఈ విధంగా కృష్ణమూర్తి పుట్టిన రోజు వేడుకలు జరపకుండా అడ్డుకున్నట్లు, చివరకు ఫ్లెక్సీలు కూడా తొలగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కళ్యాణదుర్గం పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులకు రుసుము చెల్లించాలని అంతవరకు అనుమతి ఇవ్వబోమని మున్సిపల్ అధికారులు కూడా హుకుం జారీ చేసినట్లు తెలిసింది. దీంతో మున్సిపల్ అధికారులకు రుసుము చెల్లించి ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తీసుకున్నప్పటికీ ఫ్లెక్సీలు తొలగింపు ఎంత వరకు సబబని జికె యువసేన నేతలు ఆక్రోశం వెల్లగక్కుతున్నారు.

## ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు

**- డ్రోన్ల ద్వారా నిత్యావసరాల సరఫరాకు చర్యలు**

**- అత్యవసర సమయాల్లో జెసిబి సాయంతో మరువదాటిస్తూ..**







తాడు ద్వారా నిత్యావసరాలు చేరవేస్తున్న దృశ్యం, పోచనపల్లి బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపి, కమీషనర్, జెసిబిలో వెళుతూ మరువను పరిశీలిస్తున్న ఎంపి, కమీషనర్

**హిందూపురం టౌన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త**

కర్నాటక రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు హిందూపురం చుట్టుపక్కల పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించి పోయాయి. దీంతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మరువ ఉధృతి అధికంగా వుండడంతో చౌడేశ్వరికాలనీవాసులు హిందూపురం పట్టణానికి వచ్చేందుకు అంతరాయం ఏర్పడింది. అటువైపు వెళ్లాలంటే కొట్నూరు చెరువు మరువ ఉధృతి అధికంగా వుండడంతో చౌడేశ్వరికాలనీ జలదిగ్బంధంలో వుంది. ఈ క్రమంలో ముంపు ప్రాంతాల్లోని వాసులకు నిత్యావసరాలు సరఫరా చేసేందుకు హిందూపురం మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు శరవేగంగా చర్యలు చేపడుతున్నారు. కాలనీవాసులు నిత్యావసరాల కోసం ఇబ్బందులు పడుతుండడంతో శనివారం తాడు సాయంతో ప్రజలకు నిత్యావసరాలు చేరవేశారు. ఈ సందర ్భంగా మున్సిపల్ కమీషనర్ ప్రభాతవార్తతో మాట్లాడుతూ చౌడేశ ్వరికాలనీవాసులకు నిత్యావసరాలు సరఫరా చేసేందుకు ఆదివారం నుండి డ్రోన్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. 5 నుండి 6 కిలోల బరువు గల నిత్యావసరాలను డ్రోన్ల ద్వారా అవతలికి చేరవేసేందుకు అవకాశం వుంటుందని రోజుకు 50 వేల రూపాయల అద్దెతో డ్రోన్లను నేటి నుండి అందుబాటులో వుంచుతున్నామని మరువ ఉధృతి తగ్గకపోతే డ్రోన్లతో ప్రతి రోజు ప్రజా అవసరాలు తీరుస్తామన్నారు. గడిచిన 24 గంటల్లో నీటి ప్రవాహం తగ్గిందని ఆది, సోమవారాల్లో మరింత తగ్గే అవకాశం వుందని కమీషనర్ తెలిపారు. ఇక అత్యవసర సమయాల్లో రోగులను జెసిబి సాయంతో మరువ దాటిస్తున్నామని స్థానిక ఎంజిఎం మైదానంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. జలదిగ్బంధంలో వున్న ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటున్నామని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అదేవిధంగా నీటి ప్రవాహానికి తెగిన పోచనపల్లి బ్రిడ్జిని హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్, మున్సిపల్ కమీషనర్, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డిలు పరిశీలించారు. ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపి అధికారులను ఆదేశించారు.

**ప్రజలకు ఆహారం పంపిణీ :**

వరదలతో జలదిగ ్బంధంలో వున ్న చౌడేశ్వరికాలనీ వాసులకు ఆర్యవైశ్య సంఘం వాసవిసేవాదళ్ ఆధ్వర్యంలో శనివారం ఆహారం, పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిత్యావసరాలు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆదర్శ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్, చైతన్య, అనంత్, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక టిడిపి నాయకులు కాలనీవాసులకు ఆహారం అందచేశారు.




చౌడేశ్వరికాలనీవాసులకు ఆహారం అందచేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

## వరద బాధితులకు ప్రభుత్వ పరంగా సాయం అందిస్తాం

**- యుద్ధ ప్రాతిపాదికన మరమ్మత్తు పనులు**

**అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి**

**అనంతపురం సిటీ, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



వరదలతో దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

నగరంలో వరద ముంపు వల్ల నష్టపోయిన బాధితులకు సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎవరూ అధైర్య పడవద్దని అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి భరోసా కల్పించారు. నగరంలో ఇటీవల వరద ముంపుకు గురైన శాంతినగర్, 5వ రోడ్డు, రజకనగర్, సోమనాథ్‌నగర్, రంగస్వామి నగర్, యువజన కాలనీ, హనుమాన్ కాలనీలలో శనివారం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పర్యటించారు. వరద ప్రభావం తగ్గడంతో ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను పరామర్శించారు. వరద ముంపు వల్ల పారిశుద్ధ్యం ఇతరాత్ర సమస్యలు లేకుండా తీసుకోవాల్సినచర్యలపై అధికారులతో చర్చించారు. అదే విధంగా వరద ప్రభావంతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించిన ఆయన యుద్ధ ప్రాతిపదికన వాటి మరమ్మత్తులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని సూచించారు. అదే విధంగా వీధులలో పేరుకుపోయిన బురదను తొలగించడంతోపాటు ఫైరింజన్‌లు, వ్యవసాయ స్ప్రేయర్లు ఉపయోగించి బురదను తొలగించే పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం చేసే దిశగా నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేస్తుందన్నారు. ఇప్పటికే రూ.2వేలు ప్రతి కుటుంబానికి అందించడంతోపాటు 25 కెజిల బియ్యం, ఇతరాత్ర నిత్యావసర వస్తువులను అందించడం జరుగుతోందన్నారు. వరద ప్రాంతాల్లో నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అండగా నిలిచి దాతృత్వాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగర మేయర్ మహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పోరేటర్లు శ్రీనివాసులు, దుర్గాదేవి, అనీల్‌కుమార్‌రెడ్డితోపాటు వైసీపీ నేతలు రాధకృష్ణ, దాదు, రామచంద్ర, శ్రీదేవి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## బళ్లారికి చేరిన జోడో పాదయాత్ర

**- రాహుల్ గాంధీకి ప్రజల నీరాజనం..... దారి పొడుగునా పజ్రల అభివాదం**

**బళ్లారి, అక్టోబర్15, ప్రభాతవార్త**

ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన 'భారత్ జోడో పాదయాత్ర' శుక్రవారం సాయంత్రం బళ్లారికి చేరుకుంది. శనివారం ఉదయం 6;30 గంటలకు బళ్లారి తాలుకాలోని హాలకుంది శ్రీమఠం నుంచి పాదయాత్ర ప్రారంభమయ్యింది. నగరంలోని బెంగళూరు రోడ్డు మీదుగా మోతీ సర్కిల్, రాయలసర్కిల్ మీదుగా జిల్లా కోర్టు రోడ్డు ద్వారా కమ్మభవన్‌కు చేరుకుంది. సుమారు 9 కి.మీ. పాదయాత్ర జరిపిన రాహుల్‌గాంధీ కమ్మా భవనంలో కొంతసేపు విశ్రాంతి పొంది నగరంలోని మున్సిపల్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన సార్వజనిక బృహత్ సమావేశం ముఖ్య వేదికకు చేరుకున్నారు. హాళకుంది మఠం నుంచి ప్రారంభమైన పాదయాత్రలో రాహుల్‌గాంధీకి దారిపొడగునా పిల్లలు, మహిళలు, యువకులు, వ్యాపారులు రోడ్లకు ఇరువైపులా నిలబడి రాహుల్ గాంధీకి అభివాదం చేస్తూ కనిపించారు. ఇదే సందర్భంలో పలువురు మహిళలు రాహుల్ గాంధీతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడడంతో సెక్యూరిటీ సిబ్బంది అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. రాహుల్ పాదయాత్రలో హాళకుంది మఠం నుంచి కొనసాగిన యాత్రలో ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థి మల్లికార్జునఖర్గే కూడా రాహుల్‌తో పాటు నడవడం కనిపించింది. కేపీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్, ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య, ఏఐసీసీ నాయకుడు సుర్జేవాలా, మాజీ సీఎం డా.జి.పరమేశ్వర్, కేపీసీసీ ప్రచారసమితి అధ్యక్షుడు ఎం.బి.పాటిల్ తదితర ప్రముఖులు రాహుల్‌గాంధీతో అడుగులు వేశారు. భారత్ జోడో పాదయాత్ర బళ్లారి నగరంలోకి ప్రవేశించగానే రోడ్లపై రంగురంగుల రంగవల్లులు వేసిన కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు రాహుల్‌గాంధీకి ఘనస్వాగతం పలికారు. మహిళలు వేసిన ముగ్గులను ఆసక్తిగా తిలకించిన రాహుల్ గాంధీ తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి మహిళలను అభినందించారు. ఈ సందర్భంలో విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



భారత్ జోడో యాత్ర నగరంలోకి చేరుకోగానే తనను చుట్టుముట్టిన పిల్లలతో కలిసి నడుచుకుంటూ వస్తున్న రాహుల్‌గాంధీ

## జాతీయ రహదారి రాకలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సక్సెస్

**-కేంద్రమంత్రి నితిన్ గడ్కరి సహకారం భేష్**



కేంద్రమంత్రి నితిన్ గట్కారికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి (ఫైల్‌ఫోటో)

**పుట్టపర్తి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లా ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి మీదుగా జాతీయ రహదారి మంజూరులో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సఫలీకృతుడయ్యారు. ఏ ఒక్కరూ ఊహించని, ఆశించని ఒక జాతీయ రహదారి పుట్టపర్తి మీదుగా వెళ్ళడం అనూహ్యపరిణామమనే చెప్పాలి. శ్రీసత్యసాయి జిల్లా సాధనలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కృషి ఎనలేనిదనే చెప్పాలి. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం జిల్లాగా ప్రకటిస్తారా? అన్న తరుణంలో అనుహ్యంగా పుట్టపర్తి నియోజకవర్గ కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భవించడంలో శ్రీధర్ రెడ్డి కృషి పట్టుదల వల్లే సాధ్యమైందని వైసిపి వర్గాలే తెలియజేశాయి. ఒక దశలో హిందూపురం లేదా పెనుకొండ కేంద్రంగా జిల్లా తప్పక ఏర్పడుతుందని పుట్టపర్తి ప్రజానికం సైతం నిస్తేజంలో మునిగిపోయింది. అటువంటి తరుణంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డికి భగవాన్ తస్యసాయి బాబా ప్రపంచానికి అందించిన సేవలను గుర్తించి ఆయన పేరుతో పుట్టపర్తి కేంద్రంగా జిల్లాకు నామకరణం చేయించిన ఘనత దుద్దుకుంటకే దక్కుతుంది. ఈ విషయంలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్‌ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ సహకారం ఎమ్మెల్యే దుద్దుకుంటకు కలిసి వచ్చింది. భగవాన్ సత్యసాయి బాబా 94వ జయంతి వేడుకలకు 2019, నవంబర్ 23న ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కారి పుట్టపర్తి విచ్చేశారు. ఈ సందర్భంగా పుట్టపర్తిమీదుగా ఒక ఔటర్ రింగ్‌రోడ్డు, జాతీయ రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలతో కూడిన విన్నపాన్ని కేంద్రమంత్రి గడ్కరికి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి అందజేశారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని గట్కారి ఎమ్మెల్యేకు హామీ ఇచ్చాడు. తిరిగి అదే సంవత్సరం డిసెంబర్ 13న పుట్టపర్తి మీదుగా జాతీయ రహదారి ఏఆర్పటుకు ఎన్‌హెచ్‌ఎఐ మీ విన్నపాన్ని అంగీకరించి ప్రతిపాదన పంపినట్లు మంత్రి గట్కారి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి లేఖరాసి పంపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళడంతో అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. 2020 మే 26న కేంద్రమంత్రి గడ్కారి దేశంలో కొత్తజాతీయ రహదారులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ విషయాన్ని ఇందులో పర్సనల్‌గా ఉంచమని ఎమ్మెల్యేకు లేఖద్వారా తెలిపారు. ఎంఓఆర్‌టిహెచ్ జాతీయ కార్యదర్శి గిరిధర్ 2020 జూన్ 26న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి తమ విజ్ఞప్తిని పరిశీలించామని, జాతీయ రహదారి ప్రకటన ఖరారుకోసం సంప్రదింపుల ప్రక్రియలో ఉందని లేఖరాయడం జరిగింది. 2020 డిసెంబర్ 03న ముదిగుబ్బ ఎన్‌హెచ్ 42కోడూరు ఎన్‌హెచ్ 44 లింకులు నూతన జాతీయ రహదారిగా ఎన్‌హెచ్ 342గా డిక్లరేషన్ చేస్తూ భారత ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈవిధంగా 79.6 కిలోమీటర్ల రెండు లైన్ల జాతీయ రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా పునరుద్ధరించడం జరిగింది. ఈ విషయాన్ని ఈ నెల 13న కేంద్రమంత్రి గడ్కరి ట్వీట్ల ద్వారా వ్యక్తం చేయడం జరిగింది. ఈ జాతీయ రహదారికి మొత్తం 1810 కోట్ల రూపాయలు మంజూరు చేయించి ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు రాష్ట్రాలతో పాటు అన్ని రాష్ట్రాలను కలిపి జాతీయ రహదారిని పుట్టపర్తి మీదుగా తీసుకురావడంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి విశేషమైన కృషి ఉందనడంలో సందేహం లేదు.

## భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు అబ్దుల్ కలామ్

**- అబ్దుల్ కళామ్ జయంతోత్సవ వేడుకల్లో పెరుమాళ్ల జీవానందరెడ్డి**

**పామిడి, అక్టోబర్ 15 ప్రభాతవార్త**

భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు అబ్దుల్ కళామ్ అంటూ తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు, పిజేఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు పెరుమాళ్ళ జీవానందరెడ్డి కొనియాడారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కళామ్ జయంతోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం మండల పరిదిలోని గజరాంపల్లి వ్యాల్లీ గ్రీన్ గార్మెంట్ వద్ద ఆయన చిత్రపటానికి టిడిపి సీనియర్ నాయకులు, పిజేఆర్ ట్రస్టు వ ్యవస్థాపకులు పెరుమాళ్ళ జీవానందరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భ ంగా ఆయన మాట్లాడుతూ 2020 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చటానికి తన పుస్తకం ద్వార అభివృద్ధి ప్రణాళికలను సూచించి దేశానికి అబ్దుల్ కళామ్ అందించిన సేవలు మరువలేనివని అన్నారు. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థలో ఏరోస్పేస్ ఇంజనీర్ అబ్దుల్ కళామ్ భారతదేశపు మిస్సైల్ మ్యాన్‌గా పేరుగాంచి బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ వాహన సాంకేతికత అభివృద్ధికి కృషి చేశాడన్నారు. 2002లో బిజేపి అభ్యర్థిగా కాంగ్రెష్ మద్దతుతో రాష్ట్రపతికిగా ఎన్నికై భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన అబ్దుల్ కళామ్ చిరస్మరనీయుడని తెలిపారు అబ్దుల్ కలామ్ సేవలను గుర్తించిన ఐక్యరాజ్యసమితి ఆయన జయంతిని విద్యార్థి దినోత్సవంగా ప్రకటించిందని తెలియజేస్తూ నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా ఎదుగుతూ విద్యార్థులు భావి సమాజానికి ఆదర్శం కావాల్సిన అవసరం ఎంతైనావుం దన్నారు. అబ్దుల్ కళామ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగుతూ సమాజాభివృద్ధిని ఆకాంక్షిస్తూ దేశాభివృద్ధిలో బాగస్వామ్యం కావాలని పెరుమాళ్ళ జీవానందరెడ్డి పిలుపునిచ్చారు. ఈకార ్యక్రమంలో టిడిపి రూరల్ కన్వీనర్ ముసలిరెడ్డి, పిజేఆర్ ట్రస్టు ఇన్‌చార్జ దాసరి లక్ష్మీకాంతమ్మ, సభ్యులు కత్రిమల మల్లయ్య, పాలాక్షిరెడ్డి, శ్రీరాములు, డాక్టర్ మక్బుల్, హనుమంత్‌రెడ్డి, రామారావు, మారుతీరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, జయపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, మున్నా, భాషా, హారీష్, నరేష్, ఓబులేసు, రమేష్, సత్యనారాయణరెడ్డి, విజయ్‌బాస్కర్; శివ, రాము, గోవిందు, చంద్రమోహన్‌రెడ్డి, నాగభూషణం, షేక్షావ లి, సంజీవరాయుడు, సుధాకర్‌నాయకుడు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పెరుమాళ్ళ

02ATP15.qxd:02ATP15.qxd 16/10/22 10:45 PM Page 1



## ఇంటిపైకప్పు కూలి బాలుడు మృతి

హిందూపురం టౌన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త



మృతి చెందిన బాలుడు

హిందూపురం రూరల్ మలుగూరు గ్రామంలో శనివారం తెల్లవారుజామున ఇంటిపైకప్పు కూలి శ్రీకాంత్ (3) అనే బాలుడు మృతి చెందాడు. పరిగి మండలం మోదా గ్రామానికి చెందిన చంద్రప్ప తన కుమారుడు శ్రీకాంత్‌ను అమ్మమ్మ ఇంటిలో వుంచారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటి పైకుప్పు నాని ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో కింద పడుకుని నిద్రిస్తున్న బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బిడ్డ మృతి చెందడం పట్ల తల్లిదండ్రులు బోరున విలపించారు.

## జిల్లా మహా సభలు పోస్టర్లు విడుదల

రామగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

రామగిరి మండలం లో ఆశావర్కర్ల జిల్లా మహా సభల పోస్టర్లను సిఐటియు, ఆశావర్కర్లు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు జెవి రమణ, సిఐటియు జిల్లా నాయకులు కదిరప్ప మాట్లాడుతూ.. ఆశావర్కర్లు సత్యసాయి జిల్లా మొదటి మహా సభలు సోమందేపల్లి మండలంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందని, ఈ మహా సభలకు ఆశావర్కర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె.ధనలక్ష్మి హాజరవుతారన్నారు. గత 16 సంవత్సరాలుగా ఆశావర్కర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేవలు చేయించుకుంటున్నారు. సంరక్షణ పేరుతో నియమించి నేడు అన్ని రకాల జబ్బులకు ప్రజలందరికీ సేవలు చేస్తున్నారన్నారు. గౌరవ వేతనం పేరుతో కనీస వేతనాలు కూడా చెల్లించకుండా కేవలం నామ మాత్రపు వేతనాలు చెల్లిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. సెలవు, మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులు ఇవ్వకుండా 24 గంటలు పని చేస్తున్నారు. గౌరవ వేతనం పేరుతో సంక్షేమ పథకాలకు కోత విధిస్తున్నారు. కనీస వేతనం సుప్రీం కోర్టు తీర్పు ప్రకారంగా 24వేల రూపాయలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు సిఐటియుగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ మహా సభల సందర్భంగా ఆశావర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో బి.ముత్యాలమ్మ, కె.గంగరత్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ఎమ్మెల్సీని గెలిపించుకుందాం..

తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు

మడకశిర టౌన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త



టీడీపీ ఎమ్మెల్సీని గెలిపించాలని ఓటర్లకు విన్నవిస్తున్న దృశ్యం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రైతు బిడ్డ తెలుగు దేశం పార్టీ మద్దతుదారుడు రాంగోపాల్ రెడ్డి ని గెలిపించుకుందామని తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, కౌన్సిలర్ ఉమా శంకర్ పేర్కొన్నారు. రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని గాంధీ బజార్‌లో ఉన్నటువంటి ఓటర్ల ఇంటి దగ్గరకు వెళ్లి టీడీపీ ఎమ్మెల్సీను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటరాజు, పట్టాల స్వామి, బద్రీనాథ్, మజ్జిగ వెంకటేష్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ చేతులు పరిశుభ్రత దినోత్సవం



చేతుల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

అగళి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినాన్ని అగళి మండలంలో పాఠశాలలు, కళాశాలలు, పంచాయితీ కార్యాలయాలు, ఆసుపత్రి ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చేతులను ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలి, ఎలా కడుక్కోవాలి, జోరుగా వస్తున్న నీటిలో చేతులను, చేతి వేళ్లను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలన్న విషయంపై అవగాహన కల్పించారు. పరిసరాలను వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని డా.శివానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వేణు, ఈఓఆర్డి సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఇఒ

పరిగి, అక్టోబర్ 15 ప్రభాతవార్త



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

పరిగి మండల పరిధిలోని గురవనవహళ్లి, బిందూనగర్ పాఠశాలలను మండల విద్యా శాఖాధికారి లక్ష్మీదేవి శనివారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. పాఠశాలలో నాడు - నేడు పనులు నాణ్యత తో వేగవంతంగా పూర్తి చేయాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు వుండేలా పనులు చేపట్టాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

## విద్యార్థులకు బ్యాగులు, పలకలు పంపిణీ

అంగన్‌వాడీ విద్యార్థులకు బ్యాగులు, పలకలు పంపిణీ చేస్తున్న దృశ్యం



సోమందేపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండల పరిధిలోని గుడిపల్లి గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో బెంగుళూరుకు చెందిన మురళీగుప్తా అను వ్యాపారి సుమారు 30 మంది విద్యార్థిని విద్యార్థులకు బ్యాగులు, పలకలు వాటర్ బాటిల్స్, స్నాక్స్‌ను శనివారం అందించారు. ప్రతియేటా గుడిపల్లి గ్రామానికి చెందిన వీరు బెంగుళూరులో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. ప్రతియేటా విద్యార్థులకు ఈ విధంగా పంపిణీ చేయడం జరుగుతోంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పాఠశాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చిన్నారులపట్ల శ్రద్దతో వారికి విద్యాభ్యాసం కొనసాగించాలని వారు కోరారు. కార్యక్రమంలో సిడిపిఓ శాంత లక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, నిర్మల, స్వర్ణ తదితరులు ఉన్నారు.

## జగన్మోహన్‌రెడ్డి బిజినెస్‌మ్యాన్....

- ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకే 3 రాజధానులు

- శ్రీసత్యసాయిజిల్లా తెదేపా అధ్యక్షులు బి.కె.పార్థసారథి

పెనుకొండ అక్టోబర్15 ప్రభాతవార్త



మాట్లాడుతున్న బి.కె.పార్థసారథి

జగన్మోహన్‌రెడ్డి బిజినెస్ మ్యాన్ అని, వ్యాపార దృక్పథం తోనే రాష్ట్రాన్ని పాలిస్తున్నారని శ్రీసత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బి.కె.పార్థ సారథి ముఖ్యమంత్రిపై ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకర్లసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బి.కె. మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఎద్దేవా చేశారు. మూడు రాజధానులు ప్రపంచంలో ఎక్కడ లేవన్నారు. మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్‌రెడ్డి కుట్రపన్నారని ఆయన విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అమరావతి రాజధానికే కట్టుబడి ఉందన్నారు. అమరావతి ప్రాంతంలో కట్టడాలు లేవని అంతా గ్రాఫిక్స్ అని మంత్రులు, ఎమ్మెల్యేలు అనడం దుర్మార్గం. అమరావతిలో నిర్మించిని నిర్మాణాలను కళ్లుండి చూడలేని కబోదులు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలని ఆయన ఎద్దేవా చేశారు. మూడు రాజధానులు వల్ల రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ఇప్పటికే జగన్ పాలనతో రాష్ట్రం పదేళ్లు వెనక్కు వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ పిచ్చి తుగ్లక్ పాలన తో ప్రజలు విసిగిపోయారని, వచ్చే ఎన్నికలతో జగన్‌రెడ్డి చరిత్ర ముగుస్తుందని జోస్యం చెప్పారు. ఇప్పటికైన సిగ్గు తెచ్చుకుని మూడు రాజదానులు అంశం విరమించుకుంటే ప్రజలు శాంతిస్తారని బి.కె. పేర్కొన్నారు. ఈసమావేశంలో నాయకులు కృష్ణమూర్తి, శశిభూషన్ పటేల్, జావిద్, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షి ఆలయ శిల్పకళ అద్భుతం



ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న ధార్వాడ్ పీఠాధిపతి భైరవిమాత

లేపాక్షి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

లేపాక్షి ఆలయ శిల్పకళ మహా అద్భుతమని ధార్వాడ్ పీఠాధిపతి భైరవిమాత పేర్కొన్నారు. శనివారం లేపాక్షి ఆలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహాశర్మ, శ్రీనివాసులు పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలోని చవితివినాయకుడు, ఏడు శిరస్సులు నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిపోయిన కళ్యాణమండపం, అంతరిక్షస్తంభం, తదితర వాటిని పరిశీలించి ఆలయ చరిత్రను అర్చకులను అడిగి తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అతిథి మర్యాదలతో ఆమెను సత్కరించారు.

## ఘనంగా వాల్మీకి విగ్రహం ఊరేగింపు

- ఐక్య మత్యం చాటిన వాల్మీకులు

రొద్దం, అక్టోబర్ 15 ప్రభాతవార్త



వాల్మీకి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మహర్షి వాల్మీకి జయంతిని సందర్భంగా రొద్దం మండల కేంద్రం లో వాల్మీకి విగ్రహానికి వాల్మీకి పెద్దలు, గ్రామస్తులు, అన్ని పార్టీల వాల్మీకి బోయ కులస్తులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ నాగస్వామి, తేదేపా, వైకాపా, బిజెపి కన్వీనర్లు నరహరి, తిమ్మయ్య, వేణుగోపాల్ లు హాజరైయ్యారై వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి నమస్కరించుకుని నివాళులర్పించి మాట్లాడారు.వాల్మీకులు ఐక్య మత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానిన పూర వీధులు గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి పెద్దలు, కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటు నమోదును వేగవంతం చేయండి

మడకశిర అక్టోబర్ 15 ప్రభాతవార్త



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటి కలెక్టర్,తహాశీల్దార్

స్థానిక తహాశీల్దార్ కార్యాలయం లో శనివారం స్పెషల్ డిప్యూటి కలెక్టర్ జి.చిన్నయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టభ ద్రుల ఓటు నమోదును వేగవంతం చేయాలని అన్నారు. కడప అనంతపుర కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గ మునకు, ఉపాధ్యాయుల నియోజక వర్గమునకు ఎన్నుకోబడిన శాసనమండలి సభ్యులు వెన్నపూస గోపాల్‌రెడ్డి కత్తి నరసింహారెడ్డిలు 29-03-2023న పదవీ విరమణ చేయబోతున్నారని, కావున తదిపరి ఎన్నిక నిమిత్తము1-11-2022 వతేది ప్రాతిపదికగా కొత్తగా పట్టభ ద్రుల ఉపాధ్యాయుల ఓటరు నమోదు జాబితాలు తయారు చేయవలసి ఉన్నందున పట్టభద్రుల ఓటరు జాబితాలో నమోదు కొరకు 31-10-2019 మునుపు ఉత్తీర్ణులైన ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదేని విశ్వవిద్యాలయం సంస్థ నుండి ఏదేని డిగ్రీ తత్సమాన అర్హత గల డిప్లమో పొందియున్న స్థానికంగా నివాసం ఉన్న భారతీయ పౌరులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఇందుకోసం ఫారం-18 ను పూరించి డిగ్రీ డిప్లమో పట్టాను ఏదేని గెజిటెడ్ అధికారి చేత అటెస్టేషన్ చేయించి ఓటరు కార్డు,ఆధార్ కార్డు జతపరచి నమోదు పత్రంను సమర్పించాలని అన్నారు. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా మడకశిర, అమరాపురం, గుడిబండ, రోళ్ళ,అగళి మండల కేంద్రాలు ఏర్పాటుచేయబడునని అన్నారు. అలాగే ఉపాధ్యాయుల ఓటరు జాబితా నమోదు కొరకు 31-10-2022 పూర్వం 6 సంవత్సరముల వ్యవధిలో మూడు సంవత్సరాలు ఉన్నత పాఠశాల మరియు ఆపై ఉన్న ఉన్నత విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులుగా పనిచేసిన వాళ్లు అర్హులు అని తెలిపారు. ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు అర్హులు కారు అని తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు పారం-19 పూరించి నిర్ణీతపై అధికారితో సర్వీసు సర్టిఫికేట్ పొందవలెనని అన్నారు. స్థానికంగా నివాస ధ్రువీకరణ కొరకు ఓటరు కార్డు, ఆధార్ కార్డు జతపరచవలెనని అన్నారు. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా మడకశిర, అమరాపురం,గుడిబండ, రోళ్ళ,అగళి మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయబడునని తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 12 దరఖాస్తు లు ఆఫ్‌లైన్ ద్వారా 01 మొత్తం 13 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. కావున అర్హత కలిగిన ప్రతి ఒక్కరు పట్టభద్రులు మరియు ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్యంను బలోపేతం చేయాలని స్పెషల్ డిప్యూటి కలెక్టర్ జి.చిన్నయ్య మరియు స్థానిక తహాశీల్దార్ ఆనందకుమార్‌లు కోరారు.

## నేడు ఎమ్మెల్యే బాలకృష్ణ రాక

హిందూపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదివారం హిందూపురం రానున్నారు. అనంతపురం పట్టణంలోని ఓ వివాహ కార్యక్రమానికి హాజరు కానున్న బాలకృష్ణ మార్గమధ్యంలోని హిందూపురంలో పర్యటించనున్నారు. అనంతపురం నుండి పాలసముద్రం, పరిగి మీదుగా హిందూపురం పట్టణానికి చేరుకుని ముంపు ప్రాంతాలైని ఆర్టీసి కాలనీ, శ్రీకంఠపురం, పోచనపల్లి బ్రిడ్జి పరిశీలించిన అనంతరం తిరిగి బెంగుళూరుకు వెళ్లనున్నారని టిడిపి వర్గాలు పేర్కొన్నాయి.

## కనువిందు చేస్తున్న చిత్రావతి డ్యాం



పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి డ్యాం

తాడిమర్రి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

తాడిమర్రి మండలం పెద్ద కోట్ల గ్రామ సమీపంలో చిత్రావతి నదిపై నిర్మించిన రిజర్వాయర్ నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వర్షాలతో చిత్రావతినదిలోకి అధికంగా నీరు చేరుతోంది. దీంతో శుక్రవారం డ్యాంకు ఉన్న ఏడు గేట్లలో ఐదు గేట్లను ఎత్తి దిగువ ప్రాంతానికి నీరు వదిలారు. దీంతో వేగంగా వస్తున్న నీరు చిత్రావతి నది గుండా దిగువ ప్రాంతాలకు వెళ్తోంది. ఈ దృశ్యాన్ని చూడటానికి యువకులు, పర్యటకులు అధిక సంఖ్యలో డ్యాం వద్దకు వెళ్లి తమ సెల్‌ఫోన్లలో ఆ దృశ్యాలను బందిస్తున్నారు. అలాగే దిగువప్రాంతాల్లో ఉన్న వందలాది ఎకరాల్లో పంట నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గ్రాడ్యుయేట్ చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు

తాడిమర్రి, అక్టోబర్ 15 ప్రభాతవార్త



ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని గ్రాడ్యుయేట్లు గెలిపించాలని కోరుతూ శనివారం టీడీపీ నాయకులు పలు గ్రామాల్లో పర్యటించారు. టీడీపీ మండల కన్వీనర్ కూచి రాము, ఆత్మకూరు శ్రీనివాసులు, మరువపల్లి లక్ష్మీనారాయణ, నీడిగల్లు సర్పంచు గోనుగుంట్ల నాగభూషణం ఆధ్వర్యంలో నార్సింపల్లి, నెడిగల్లు, ఆత్మకూరు, అగ్రహారం, మరువపల్లి, గ్రామాల్లో కలియ తిరిగారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. మరికొన్ని గ్రామాల్లో గ్రాడ్యుయేట్లను కలవడానికి ప్రణాళికలు రూపొందించినట్లు బిసి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు ఆత్మకూరు శ్రీనివాసులు, మరువపల్లి లక్ష్మీనారాయణలు తెలిపారు.

## పంటకోత ప్రయోగాలతో రైతన్న విలవిల



పంటకోత ప్రయోగాలు చేస్తున్న అధికారులు

బత్తలపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండలంలో అధికారులు చేపట్టిన పంటకోత ప్రయోగాలతో ఏ పొలంలో చూసినా నామమాత్రపు దిగుబడి వస్తుండడంతో రైతన్నలు విలవిలలాడుతున్నారు. శనివారం ఏఓ ఓబిరెడ్డి, జెడ్పిటిసి సభ్యురాలు కోటి సుధల పర్యవేక్షణలో బత్తలపల్లి, అప్పరాశ్చెరువు గ్రామాలలో ఏఎస్ఓ లక్ష్మీనరసింహాశర్మ నేతృత్వంలో పంటకోత ప్రయోగాలు చేపట్టారు. బత్తలపల్లిలో సోమశేఖర నాయుడుకు చెందిన 28/1డి సర్వేనెంబరులో 1,900గ్రాములు, అప్పరాశ్చెరువులో 108/1బి లింగమయ్య పొలంలో 1,300 గ్రాములు దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఈ దిగుబడితో పంట పెట్టుబడి కూడా దక్కదని రైతులు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వీరాంజనేయులు, విహెచ్ఓ హరిప్రియ, వీఎస్ఏ ముత్యాలప్ప, విహెచ్ఏ సత్యనారాయణ, ఎంపిఈఓ రవికుమార్, వీఆర్ఓ రవికాంత్‌రెడ్డి, వీఆర్ఏ నరసింహులు, రైతులు సత్యనారాయణరెడ్డి, లింగమయ్య, శ్రీనివాసులు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల03 : పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించిన బిజెపి నాయకులు

గోరంట్ల, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండలంలోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేంద్ర సెన్సార్‌బోర్డు సభ్యులు జిఎం శేఖర్ నాయకత్వంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు జన్మదిన వేడుకలు మండల భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ వైద్య శాలలో రోగులకు పండ్లు, పాలు పంచి ఆయనకు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యవర్గ సభ్యులు శంకర్‌రెడ్డి, మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ముంతాజ్, మేదర శ్రీనివాసులు, చిట్టా కగేంద్ర, శంకర్, లక్ష్మీనరసు, లక్ష్మీపతి, వెంకటేష్, గుంతపల్లి చంద్ర, తుండూరు వాండ్లపల్లి వెంకటేష్, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## అప్పుడే పుట్టిన శిశువును ముళ్ల పొదల్లో పడేసిన కసాయి మనుషులు

- ఐసిడిఎస్, పోలీసుల సహాయంతో ఆసుపత్రికి తరలించిన ప్రజలు

గోరంట్ల, అక్టోబర్ 15 ప్రభాతవార్త



శిశువును కవర్‌లో చుట్టేసిన దృశ్యం

అప్పుడే పుట్టిన మగబిడ్డను ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి రోడ్డు పక్కన గల ముళ్ల పొదల్లో పడేసిన ఘటన గోరంట్ల మండలంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. బెంగుళూరు -హైదరాబాద్ జాతీయ రహదారి లోని గోరంట్ల మండలం పాలసము ద్రం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన శిశువును ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి పడవేశారు. అది గమనించిన చుట్టుపక్క ప్రజలు పోలీసులకు, అంగన్‌వాడీ సిబ్బందికి సమాచారం అందించడంతో పెద్ద ఎత్తునప్రజలు, పోలీసులు చేరుకుని వారి సహకారంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా అప్పటికే ఆ శిశువు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో సిఐ సుబ్బరాయుడు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీల సౌభాగ్యవతి, సర్పంచు చిన్నగంగప్ప, పంచాయితీ కన్వీనర్ గోవిందరెడ్డి ఆ చిన్నారిని చుట్టిపడేసిన కవర్‌పై బెంగుళూరు అడ్రస్ ఉండటంతో ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## పరవళ్లు తొక్కుతున్న పెన్నానది

రొద్దం, అక్టోబర్ 15 ప్రభాతవార్త

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు పొంగి పోర్లుతూ ప్రవహిస్తూ పెన్ననాది పరవళ్లు తొక్కుతోందని గ్రామా ప్రజలు తీరాలకు వెళ్లకూడదని ఎస్ఐ మునిస్వామి, తహాశీల్దార్ అనంత చారిలు మండల ప్రజలకు సూచించారు. పెద్ద మంతూరు, చిన్నమంతురు, నల్లూరు దండేపల్లి, కల్లుకుంట, కందికూర్ల పల్లి, చిన్న కోడిపల్లి, నాగిరెడ్డిపల్లి, గౌరాజుపల్లి, ఎం. కొత్తపల్లి, నాగనాగేపల్లి గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సమస్య వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తహాశీల్దార్, ఎస్ఐ మునిస్వామి సూచించారు.



పరవళ్లు తొక్కుతున్న పెన్నా నది

## జగనాసురుడు రాజధానికి రాహువులా అడ్డుపడ్డాడు

-మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

శ్రీసత్యసాయిజిల్లా, అక్టోబర్ 15, ప్రభాతవార్త ప్రతినిధి:



ఎలాగైతే సూర్యుడికి గ్రహనం పట్టి లోకం చీకటిగా మారుతుందో, అదే తీరులో రాష్ట్రానికి, రాష్ట్ర రాజధానికి జగనాసురుడు అడ్డు పడి అభివృద్ధిని 50 యేళ్ళు వెనక్కు తీసుకెళుతున్నాడని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం పుట్టపర్తిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పుట్టపర్తి నియజోకవర్గ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథ్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఐఎఎస్ అధికారులకు పూర్తిగా స్వేచ్ఛనిచ్చేవారమని, అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి భిన్నంగా మారిందన్నారు. ఎంతో బాధ్యతయుతంగా ప్రజలకు మేలు చేయాల్సిన కొందరు ఐఎస్ అధికారులు ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ అత్యుత్సాహం చూపుతున్నారని, కనీసం కోర్టు ఆదేశాలను సైతం ప్రక్కన పెట్టి పాదయాత్ర చేస్తున్న వారికి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. డ్రైవింగ్ రాని వ్యక్తికి వాహనం ఇవ్వడం ఎంత తప్పో, పరిపాలన తెలియని వ్యక్తికి అధికారం కట్టబెట్టడం అంతేతప్పని, ఇప్పుడు రాష్ట్రం అలాంటి వ్యక్తి చేతిలో ఉండడం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీనాయకులు సామకోటి ఆదినారాయణ, మహమ్మద్ రఫీ, రామాంజినేయులు, బెస్తచలపతి, ఓబులేసు, శ్రీరాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మించాలంటూ తెదేపా నిరసన

బుక్కపట్నం, అక్టోబర్ 15, ప్రభాతవార్త



నిరసన వ్యక్తం చేస్తున్న తెదేపా నాయకులు

మొన్నకురిసిన భారీ వర్షాలకు చిత్రావతి నది ఉధృతంగా ప్రవహించడంతో బుక్కపట్నం చెరువు మరువు పెద్ద ఎత్తున పారడంతో నల్లమ్మ దేవాలయం వద్ద ఉన్న అతిపురాతనమైన వంతెనపై నుండి నీరు ఉధృతంగా ప్రవహించిందని, సదరు వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలని శ్రీసత్యసాయిజిల్లా తెదేపా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అతి పురాతనమైన ఈ వంతెన ఎప్పుడు కూలుతుందోనని ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని, ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నూతన వంతెనకు నిర్మాణపనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొత్తపల్లి జయప్రకాష్, తెలుగుయువత సుధీర్, సామకోటి ఈశ్వరయ్య, చిట్టిబాబు, రామాంజి, సాదిక్‌వలి, అంజి, గంగాద్రి, వంశీకృష్ణ, రమణ, నారాయణ స్వామి నాయకులు పాల్గొన్నారు.

## పూర్తయిన ఈ-పంట గ్రుణీకరణ

పుట్టపర్తిరూరల్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

జిల్లా వ్యాప్తంగా ఈ-పంట నమోదుపై గృణీకరణ ప్రక్రియ పూర్తయినట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా చేపడుతున్న ఈ ప్రక్రియ ద్వారా జిల్లా వ్యాప్తంగా 2,74,041 మంది రైతులకు ఈ పంట నమోదు చేయడం జరిగిందన్నారు. వారిలో 2,54,703 మంది రైతులకు ఈ కెవైసి పూర్తి చేయడం జరిగిందని, 19,338 మంది రైతులు ఇంకా ఈ కెవైసి చేయించుకోవాల్సి ఉందన్నారు. రేపటిలోపు మిగిలినవారికి ఈ కెవైసి పూర్తి చేసేలా చూస్తామన్నారు. ఈ కెవైసి చేయించుకొని రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌కోరారు. ఈ కెవైసి ఆధారంగానే రైతుభరోసా, సున్నావడ్డీ, పంటరుణాలు, ఇతర లబ్ధిచేకూర్చడం జరుగుతుందన్నారు. కావున రైతులు అవకావాన్ని వినిగించుకోవాలని కలెక్టర్ కోరారు.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

పుట్టపర్తిటౌన్, అక్టోబర్ 15, ప్రభాతవార్త



జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్‌గా పేరొందిన స్వర్గీయ అబ్దుల్ కలాం జయంతిని శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముస్లింమైనారిటీ కార్యదర్శి మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సాయిమా హోటల్ నందు కీ॥శే॥ ఎ.పి.జె.అబ్దుల్ కలాం చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి అందించిన మహోన్నతమైన సేవలను కొనియాడారు. అనంతరం గోకులంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల యందు విద్యార్థినీ విద్యార్థులకు అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ మరియు వాల్మీకి సంఘం నాయకులు రామాంజినేయులు, జిల్లా ఈడిగ సంఘం అధ్యక్షులు రమణగౌడ్, వడ్డెర సంఘం నాయకులు తిరుపాల్ పాల్గొన్నారు.

## పుట్టపర్తి-తిరుపతి, కదిరి-పుట్టపర్తి నూతన ఆర్‌టిసి బస్సు సర్వీసులు ప్రారంభం

పుట్టపర్తి, అక్టోబర్ 15, ప్రభాతవార్త

పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి నుండి తిరుపతికి , అలాగే కదిరి నుండి పుట్టపర్తికి మరొక నూతన బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ( డిపిటిఓ) మధుసూధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా పుట్టపర్తి పరిసర ప్రాంతాల ప్రజలకు అనుగుణంగా 16వ తేది నుండి పుట్టపర్తి నుండి సర్వీస్ నెంబర్ 68911 ఎక్స్‌ప్రెస్ సర్వీసుగా ప్రతి రోజు మధ్యాహ్నం 03:00 గంటల నుండి కదిరి, మదనపల్లి మీదుగా తిరుపతికి రాత్రి 09:30 గంటలకు చేరుకునేలా నూతన సర్వీసు ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే అదే బస్సు తిరిగి మరుసటి రోజు తెల్లవారుజామున తిరుపతి నుండి ఉదయం 04:00 గంటలకు సర్వీసు నెంబర్ 68912తో బయలుదేరి పుట్టపర్తికి ఉదయం 10:30 గంటలకు చేరుకుంటుందన్నారు. కావున పుట్టపర్తినుండి తిరుపతికి వెళ్ళే ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

## కర్ణాటక మద్యం, గుట్కా విక్రయదారుడు అరెస్ట్

కొత్తచెరువు, అక్టోబర్ 15, ప్రభాతవార్త

మండల కేంద్రమైన కొత్తచెరువులో కర్ణాటకమద్యం మరియు గుట్కా అమ్ముతున్న విక్రయదారుడిని అదుపులోకి తీసుకున్నట్లు కొత్తచెరువు ఎస్ఐ లింగన్న తెలిపారు. తమకు రాబడిన సమాచారం మేరకు గ్రామంలోని అన్నపూర్ణ హోటల్ వెనుక నిందితుడు ఈడిగ ఈశ్వరయ్య తన దుకాణంలో వీటిని అమ్ముతుండగా పట్టుకొని అతని వద్ద నుండి 10 హైవార్డ్స్ చీర్స్ విస్కీ 90 ఎంఎల్ పాకెట్లు, బాదుషా, వి1టొబాకో, విమల్‌పాన్‌మసాలా పాకెట్లు మొత్తం 31 చిన్న పాకెట్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

## వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

చిలమత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండలంలో వివిధ గ్రామ పంచాయతీల్లో ఖాళీగా వున్న వాలంటీర్ పోస్టులకు నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఓ రామ్‌కుమార్ తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొడికొండ పంచాయతీలో 1, దేమకేతేపల్లి-(1) 1, చిలమత్తూరు-(1) 1, సోమఘట్ట 1, మొత్తం 4 వాలంటీర్ పోస్టులు ఖాళీగా వున్నాయన్నారు. ఇందుకు సంబంధించి అర్హత వుండి ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 16 నుండి 23లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి ఇంటర్వ్యూ తేదీ తరువాత ప్రకటిస్తామని ఎంపిడిఓ తెలిపారు.

